# పరిమాణం

'స్త్రీవాద' మంటే 'సాధికారత' కోసం పోరాటం... ఆధిపత్యం కోసం కాదు.

- జయప్రద

ఆ రోజు... మార్చి ఎనిమిది!

మా స్నేహితురాలి ఇంట్లో 'మహిళా దినోత్సవ వేడుకలు' ఘనంగా జరుగుతున్నాయి. ఆ ఇంటి ఇల్లాలు స్వాతి డిన్నర్ సమకూర్చడంలో సతమతమైపోతోంది. ఆమె తరపున ఆహూతుల అవసరాల్ని తెలుసుకునే నిమిత్తం ఆ లివింగ్ హాల్‌లో బొంగరంలా తిరుగుతున్నాను నేను.

గ్రూప్స్ గ్రూప్స్‌గా తమకు ఇష్టమైనవాళ్ళతో అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"గట్టిదానివేఁ... మీ ఆయన్ని ఇంకా నీ వెనకే తిప్పుకుంటున్నావే?"

"ఆ... మొదటినుండీ భర్తల్ని మన చెప్పుచేతుల్లో పెట్టుకోవాలి. 'మొగుడు కదా...' అని మురిపాలు పడ్డాం అనుకో- అంతే! మన లైఫ్ అయిపోయినట్టే..!!" విజయ ముఖంలో విజయగర్వం!

నేను ఉలిక్కిపడ్డాను.

నేనెందుకు ఉలిక్కిపడాలి..?

నేనూ ఆడదాన్నే...

ఆడదాని స్వేచ్ఛకోసం అల్లాడుతున్నదాన్నే!

కానీ, ఎందుకో... ఆమె మాటలు నాకు నచ్చలేదు.

నచ్చకపోవడం చిత్రమే!

ఎందుకంటే...

నేనూ పోరాడుతున్నాను -

మా హక్కుల కోసం పోరాడుతున్నాను.

కానీ, మనం పోరాడుతున్నది దేని కోసం?

సమానత్వం కోసమా?

ఆధిపత్యం కోసమా..?

మన మనసులు నలిగిపోకుండా చూసుకోవడం కోసమా?

మన మగాడి మనసును నలపడం కోసమా..?

మనకేం కావాలో... మనమేం చేయాలో... మనం మర్చిపోతున్నామా?

మన మేధస్సును చాపలా చుట్టి అవతల పెట్టేశామా?

నాలో చిక్కటి దిగులు!

"వసుధా! కబుర్లు చెప్పడం కాదు... చేసి చూపించాలి! అందుకే నా పోరాటం... పోరాటంలో భాగమే ఈ బాసిజం!"

నాకు నవ్వొచ్చింది... విజయ సిద్ధాంతీకరణకు.

– మహిళా సంవత్సరం మీద ఒట్టు... నేను పోరాటానికి విరుద్ధురాల్ని కాదు. నేను నెత్తిమీద సవారీ చేస్తున్న భర్తల అకృత్యాల్ని నిరసిస్తూ పోరాడుతాను.

– గాజుపాత్ర లాంటి ఆడదాని మనుసును ముక్కలు చేసి తాము నష్టపోతున్న ఈ పురుషాహంకారానికి నా నిరసన వ్యక్తం చేస్తూ పోరాడుతాను.

– స్త్రీని చిన్నచూపు చూస్తున్న ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతాను.

– భర్తతో సమాన స్వేచ్ఛ కోసం, నా తోటిస్త్రీలతో సమంగా నేను మౌనపోరాటాలు చేస్తాను.

– మేము పోగొట్టుకున్న రెక్కలను తిరిగి సంపాదించడం కోసం బహిరంగ యుద్ధాలు చేస్తాను.

– ఈ మహిళా సంవత్సరం సాక్షిగా నన్ను నమ్మండి.

– నేను పోరాటంలో ఒక శక్తిని... ఒక యుక్తిని! కాకపోతే...

– ఆ పోరాటంలో ఓ సత్యం దాగుంది... దాన్ని గుర్తించాలి.

– గుప్పెట్లో పెట్టుకుని సాధించలేనిది గుండెల్లో పెట్టుకుని సాధించొచ్చు!

– 'గెలుపు' అనేది మెట్టు ఎక్కడానికి వాడుకోవాలి కానీ.., మనుషుల్ని ఆటబొమ్మలుగా వాడుకోవడానికి కాదనే స్వల్పజ్ఞానాన్ని మనం కోల్పోకూడదు.

– శిల లాంటి మనసుల్ని కరిగించుకోవడమే గెలుపు...

– పువ్వులాంటి స్త్రీ మనసుని శిలలా మార్చుకోవడం... ఓటమి!

– పరమపద సోపానంలో మనం పాము నోట్లో పడకుండా నిచ్చెన ఎక్కాలి. అంతే కానీ,

– మన మగాణ్ణి పాము నోట్లోకి నెట్టడం మన ధ్యేయం కాకూడదు. ఈ సత్యం మనం తెలుసుకోవాలి. లేకపోతే మన పురుషుడితో పాటు మనమూ నష్టపోతాం.

– అప్పుడే నష్టపోతే ఎలా? ఇంకా మన సాధించాల్సింది ఎంతో వుంది.

– అప్పుడే పారిపోతే ఎలా?

– ఇంకా చాలా సమస్యలు మనముందు చేతులు కట్టుకుని నిల్చోనున్నాయి... వాటి సంగతి ఏమిటి?

– మనకు స్వేచ్ఛ కావాలని ఉద్యోగాల కెళ్తున్నాం. అక్కడ వుందా మనకు స్వేచ్ఛ? అక్కడ వుందా మనకు రక్షణ?

– పోనీ... ఇంటికి తిరిగివచ్చిన మహిళకు తన పురుషుడి దగ్గరనుండి సాదర ఆహ్వానం ఉందా? లేదు. అనుమానం వుంది, దెప్పిపొడుపు వుంది, కాంప్లెక్స్ వుంది. దాని గురించి ఆలోచిద్దాం.

– మన ముందు అజ్ఞానం నోరు తెరుచుకుని నిలబడివుంది. దానిని ఎలా తొలగించాలా... అన్న విషయం గురించి ఆలోచిద్దాం.

– తన భార్య కొడుకుని కనివ్వలేదని అలిగి, ఇంటికి రానివ్వని భర్త గురించి ఆలోచిద్దాం.

"మూర్ఖుడా! మగ నలుసు కలగాలంటే...

నీలో 'వై' క్రోమోజోమ్స్‌ని మీటాలి.

నీలో తప్పు పెట్టుకుని, నీ భార్యను సాధిస్తావేం?" అని అందరూ అరవండి... అలగండి... అతన్ని సాధించుకోండి... పోరాటం సాగించండి!

– ఇంటా బయటా స్వేచ్ఛ కోసం, రక్షణ కోసం, హక్కు కోసం పోరాడండి!

కానీ, అది...

– ఒక వ్యక్తి స్వార్థం కోసం కాకూడదు.

– పోరాటం సమాజం కోసం కావాలి... అందులో... నువ్వు... నేను... మరొకరు... సమాజం బాగుపడిన రోజు అందరం బాగుపడ్తాం.

●

"ఆడవాళ్ళం... ఎప్పుడూ ఇలా సరదాగా వుండాలి. మగాడి దాష్టీకపు చిటికెన వేలు పట్టుకుని తిరిగే రోజులు పోయాయ్!"

తుళ్ళిపడ్డాను. వెనక్కుతిరిగి చూశాను.

సింధూర ఆవేశంగా అంటోంది.

మంచిదే... కానీ...

– మనకు ఇవ్వబడిన 'మహిళా దినం' ఈ సరదాల కోసం కాదు, కాకూడదు. అది మనకు ప్రత్యేకంగా ఇవ్వబడిన వరం!

ప్రతీ మహిళ ఆ రోజున –

గతించిన సంవత్సరంలో ఎన్ని మెట్లు ఎక్కామో లెక్కలు కట్టాలి.

– ప్రతీ మహిళ... మహిళా దినం రోజు... మరో మహిళా దినం వచ్చేలోపు ఏమి సాధించాలో ఓత్ తీసుకోవాలి...

మహిళా దినం పరిమాణాన్ని, దాని గౌరవాన్ని పెంచాలి.

– అప్పుడే స్త్రీవాదానికి ఒక గౌరవం!

●

ఒక మూలనుండి ఏ వేదన తాలూకుదో- చిన్న ఏడుపు ధ్వని తరంగం నా చెవులకు సోకింది... నా మనసు అక్కడ ఆగింది.

నా కాళ్లు ఆ మూలకు నడిచాయి.

అక్కడ... ఝాన్సీ గోడ వైపుకు తిరిగి కూర్చోనుంది.

పక్కనే... సౌమ్య!

నన్ను చూసి ఝాన్సీ కళ్ళు తుడుచుకుంది. నేను మెల్లగా వెళ్లి వాళ్ళ ప్రక్కకి మోడాని జరుపుకుని కూర్చున్నాను.

సౌమ్య నావైపు తిరిగి సంప్రదాయ పద్ధతిలో పలకరింపుగా ఓ చిరునవ్వు నవ్వి ఝాన్సీతో సంభాషణను కొనసాగించింది...

"ఝాన్సీ! నిన్ను ఇంకా తన గుప్పెట్లో పెట్టుకోవాలని అనుకునే మీ ఆయన్ని వదిలెయ్‌వే! రోజులు మారాయి. నీకేం? ...డబ్బుంది. నువ్వు మరో పెళ్ళి చేసుకోవచ్చు! నా మాట విను... ఎన్ని రోజులని స్వేచ్ఛ లేకుండా బతుకుతావు?"

ఉలిక్కిపడ్డాను నేను.

"సౌమ్యా... మా ఆయన నిరంకుశుడేనే! కానీ, నన్ను చాలా ప్రేమిస్తాడే!" ఝాన్సీ కంఠంలో దయనీయత... భర్తను వదలలేని నిస్సహాయత... అతని ఆధిపత్యాన్ని ఓర్చుకోలేని వ్యతిరేకత!

నా మనసు ఝాన్సీ సమస్య పట్ల స్పందించింది. నేను ఆమెను ఓదార్చబోయాను.

సౌమ్యలో ఆవేశం ఇంకా తగ్గినట్లు లేదు. నాకు అవకాశం ఇవ్వకుండా తనే మరలా అంది- "చూడు ఝాన్సీ! ఈ మగవాడు తెలివిగలవాడు... మనకు సంకెళ్ళు వేసి, 'ప్రేమ' అనే తాళం చెవిని మన చేతికే ఇచ్చి, ఆ తాళం తీసి స్వేచ్ఛగా ఎగిరిపోలేని మన బలహీనతను చూసి గర్వపడ్తుంటాడు. అలాంటి ఛాన్స్ మనం వాళ్ళ కివ్వకూడదు. మనలాంటి వాళ్ళు ఇలాటి వాళ్ళను బహిష్కరిస్తే సమాజం బాగుపడుతుంది."

నా మనసు మూలిగింది. సౌమ్య చెప్పే మాటలు నాకు నచ్చాయో, నచ్చలేదో పూర్తిగా అర్థంకాని అయోమయంలో పడ్డాను. సౌమ్యను పూర్తిగా సమర్థించలేని భావం!

ఎందుకు? ఎందుకని..?

స్త్రీని సపోర్ట్ చేస్తూ మార్చబడిన చట్టాల్ని "భేష్..!" అని మెచ్చుకున్న నా మనసుకు ఈరోజు ఏమైంది?

భర్త వల్ల, అత్త వల్ల అన్యాయం కాబడుతున్న స్త్రీని ఒళ్ళోకి తీసుకోవడానికి వచ్చిన 'గృహహింస' చట్టాన్ని సంతోషంగా ఆహ్వానించిన నా మనోభావాలకు ఏ రోగం వచ్చింది?

'నా వాడు... నా వాళ్ళు... వాళ్ళు మారుతారు' అని ఎదురుచూసి, వాళ్ళ అకృత్యాల్ని సహించినంత కాలం సహించి, అవి మితిమీరిన క్షణాన తిరుగుబాటు చేస్తున్న మహిళలను అభినందించే ఈ మనసుకు ఈ వేళ ఏమైంది?

నా మనసు పొరల్లో చీకటి అలుముకుంది. నేను మానసికంగా నా నేస్తాల నుండి డిటాచ్ అయ్యాను. నా లోకంలోకి నేను వెళ్లిపోయాను...

సమస్యకు పరిష్కారం పోరాటమే కానీ, పారిపోవటం కాదు.

సమస్యకు మూలకారణాన్ని వెతికి, వేరును తినేసే ఆ పురుగును ఏరిపారేయాలే గానీ, వేరునే పెరికేయకూడదు.

ఎందుకంటే... ఆ వేరు చాటున మానవబంధాలు వున్నాయి... సంసారాలున్నాయి... భార్యాభర్తల్ని అల్లుకుని పిల్లలున్నారు.

హఠాత్తుగా నా ఆలోచనలు ఆగి వెనక్కు తిరిగాయి.

అంటే... అంటే... సమస్యా పరిష్కారానికి 'తల వంచడం' అనే మార్గాన్ని ప్రోత్సహిస్తోందా తను?!

ఊహుఁ... కాదు!

మరేవిటి?

యుద్ధభూమిలో ఉపయోగించే ఆయుధాలు చాలా వుంటాయి. ఏ ఆయుధంతో అయినా పోరాడొచ్చు. కావాల్సింది... గెలుపు- అంతే! ఆ గెలుపులో శత్రువు చనిపోయినా పర్వాలేదు.

ఇక్కడా ఆయుధాలు చాలానే వున్నాయి... కానీ, పోరాటంలో చిన్న తేడా! ఈనాటి ఆడదాని ఆవేశం వెనుక ఆయుధాలు చాలా నిశ్శబ్దంగా పడున్నాయి.

ధైర్యం... ఓర్పు... ఆలోచన... ముందుచూపు...

ప్రేమ, పట్టుదల, పోరాటం...

ఆఖరి అస్త్రంగా... తెగింపు!

కానీ... ఇక్కడ...

ఆయుధం ఏదైనా,

గెలుపు ఆమెదయినా...

అతను చావకూడదు!

అతన్ని గెల్చుకోవాలి!!

నా పోరాటం కేవలం 'గెలుపు' కోసమే కాదు...

ఆ 'గెలుపు'లో బతుకు నిబిడీకృతమై వుండాలి-

ఆ బతుకులో సంతోషం వెల్లువై పోవాలి!

లేకపోతే... పోరాటానికి అర్థం లేదు.

ఇది నిజం !

మగవాడు గుండెల్లో ఇంత గొప్ప ఆయుధాలు లేవు!!

అతని మనుగడలో-

శాడిజమ్ వుంది... బెదిరింపు వుంది!

'ఇగో' వుంది...

నిరంకుశత్వముంది!

ఎన్నో యుగాలుగా అతను వాటిని ఉపయోగిస్తూనే వున్నాడు...

ఇవేవీ స్త్రీని గెల్చుకోలేదు.

స్త్రీ అతనికి భయపడింది...

చెడు అలవాట్లకు బానిస అవుతాడన్న భయంతో వణికింది.

నేరం అతను చేస్తే... శిక్ష కుటుంబం భరించాలి. అందుకే... అతనికి ఓడినట్లు నటించింది. ఆనాడు... బతుకు ఓ నటన, ఓ బూటకం. ఈనాడు... మనకు 'నటన' వద్దు. నిజం కావాలి... ఆ నిజం కోసం పోరాటం చేయాలి... ఆ పోరాటం వల్ల బ్రతుకు పండాలి.

"అబద్ధాల బతుకే నాకు ఇష్టం. ఆధిపత్యం సింహాసనమే నాకు కావాలి!" అంటాడా?

అలా అని.... మగవాడు ఇంకా శిలగానే వుంటానంటే...

అది వాడి ఖర్మ!

స్త్రీ జీవితాన్ని భస్మం చేస్తానంటే మాత్ర- అప్పుడు ఆడది 'ఆదిశక్తి' కావాలి, అయితీరాలి!

...తన మౌనాన్ని ఛేదించి తన జీవితాన్ని తనే నిర్మించుకోవాలి.

"ఏవిటీ... అలా బ్లాంక్‌గా అయిపోయావు?"

ఉలిక్కిపడ్డాను.

సౌమ్య నన్ను తట్టి పిలుస్తోంది.

"ఏవీ లేదు... ఏవీ లేదు!" తడబడ్డాను.

"సౌమ్యా... ఆయన క్రూరుడేం కాదే! కాకపోతే- నా మీద సవారీ చేయాలని చూస్తాడు... అంతే!!" బేలగా చూస్తూ అంది ఝాన్సీ.

నోరు తెరవాలనుకున్నాను నేను. కానీ.., అక్కడికక్కడే సమస్యను పరిష్కరించాలనుకోవడం తెలివైన పని కాదు. అందుకే మరలా మౌనంలోకి వెళ్ళిపోయాను.

"ఆ సవారీ నీకొద్దు! నీ జీవితాన్ని నువ్వు నిర్మించుకో!"

ఝాన్సీ కంట్లో నుండి కన్నీటిబొట్టు రాలిపడింది.

ఆ కన్నీటిబొట్టు నాకు చాలా చెప్పింది... ఇప్పుడు నాకు నోరు తెరవాల్సిన సమయం వచ్చింది-

"ఝాన్సీ..." పిలిచాను.

"నీకు కావాల్సిందేమిటి? అతను మారడమా? నీ జీవితం మరోలా మారడమా?"

"ఆయన లేందే నేను బతకలేను..." మరో కన్నీటి బొట్టు ఈసారి. అది గొంతులో నుండి రాలింది.

"నీలాంటివాళ్ళ వల్లే ఈ మగాళ్ళు విర్రవీగేది! నీ ఖర్మ... ఇంక నిన్నెవ్వరూ బాగుచెయ్యలేరు!" సౌమ్య విసుక్కుంది.

ఈసారి నా ప్రశ్న సౌమ్య వైపుకి గురిపెట్టబడింది-

"సౌమ్యా! నీకేం కావాలి? ఝాన్సీ బతుకు బాగుండడమా? ఝాన్సీకి కొత్తబతుకు రావడమా?"

సౌమ్య ఆలోచనలో పడింది. నేను కన్నీటిబొట్టు వైపు చూశాను.

"ఝాన్సీ! నీకు నీ భర్త కావాలి. కానీ... అతని అధిపత్యం, అతని అమానుషత్వం నీకొద్దు... అవునా?"

'అవును...' అన్నట్టు తలూపింది ఝాన్సీ.

"అయితే, నీ మనసును కాస్త గట్టిపరచుకో! నీ దగ్గర పదిలంగా, మౌనంగా వున్న సామ, దాన, భేద, దండోపాయాలతో అతన్ని గెలుచుకో! నీతో సహకరించడానికి చాలామంది మహిళలు నీ వెనక వున్నారు. చట్టం నీకు సహకరిస్తోంది. సమాజం నీకు భయపడ్తోంది. ఇదంతా నీ యుద్ధభూమి... ఇప్పుడు నీ ఆయుధాల్ని వాడుకోవాల్సిన అవసరం వచ్చింది. నాకు తెలుసు... నీవాణ్ణే కాదు- నువ్వు జీవితాన్నే గెల్చుకోగలవు. ఆల్ ది బెస్ట్... నీకు నా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు."

ఝాన్సీ పెదాల మీద చిరునవ్వు.

అది వాన వెలసిన వాతావరణపు చిరునవ్వు.

కావాలనుకున్న 'గెలుపు' తాలూకు చిరునవ్వు.

●

'పత్రిక' మాసపత్రికలో ప్రచురితమైన కథ